క్లుప్తంగా

బీకేఎం స్ట్రీట్‌లో అగ్నిప్రమాదం



ఇంటిలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కడప అర్బన్‌: కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో అమ్మవారిశాల వెనుకాల ఓ నివాస గృహంలో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న కడప అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామాన్లతో పాటు, వ్యాపారానికి ఉపయోగిస్తున్న జీడిపప్పు, బాదం పప్పులు, బిర్యానీ ఆకులు మొదలైనవి కాలిపోయాయి. యజమాని పి. జాషు ఫిర్యాదు మేరకు దాదాపు రూ. 50,000 ఆస్తి నష్టం జరిగినట్లు జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి, కడప ఫైర్‌ స్టేషన్‌ అధికారి పి. బసివిరెడ్డి తెలియజేశారు.

18న ప్రమాణ స్వీకారం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: ఈ నెల 18న వైయస్సార్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షురాలిగా విజయ జ్యోతి ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పార్టీ వర్గాలు తెలిపాయి. బుధవారం ఉదయం 10 గంటలకు నగరం లోని మహావీర్‌ సర్కిల్‌ నుండి కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారని, 11 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పార్టీ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు.

తైక్వాండో పోటీల్లో నగర క్రీడాకారుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప స్పోర్ట్స్‌: నగరంలోని వైఎస్‌ఆర్‌ స్టేడియంలో ఈనెల 15న నిర్వహించిన 1వ ఓపన్‌ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కడప నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు శిక్షకుడు జంషీర్‌ తెలిపారు. ఎస్‌. సాదియా, ఎస్‌.ఆస్మ, ఎస్‌. ఆయేషాలు గోల్డ్‌మెడల్స్‌, ఎస్‌. జోహ, ఎస్‌. సైఫా, ఎస్‌. ఫాతిమా తషీం, ఎస్‌. మజీం, ఎస్‌. అయాన్‌లు సిల్వర్‌ మెడల్స్‌ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని కడప శాసన సభ్యురాలు మాధవీరెడ్డి అభినందించారు.

అయోధ్యలో ప్రార్థనలకు నగర వాసులు



ఆర్టీసీ బస్టాండులో బస్సు వద్ద అయోధ్యకు వెళ్లనున్న భక్తులు

కడప కల్చరల్‌ : అయోధ్యలో ఈనెల 18 నుంచి 29వ తేది వరకు జరగనున్న అయోధ్య సాధన శిబిరం కార్యక్రమానికి కడప నగరం నుంచి భక్తులు తరలివెళ్లారు. సోమవారం రెండు ఆర్టీసీ బస్సుల్లో బస్టాండు నుంచి వారు బయలుదేరారు. కడప నగరం ఏపీహెచ్‌బీ కాలనీ శ్రీ కోదండ రామాలయానికి చెందిన భక్తులు, సేవా బృందం సభ్యులు, ఆలయం ధర్మకర్త దేసు వెంకటరెడ్డి పర్యవేక్షణలో బయలుదేరారు. అన్నమయ్య జిల్లా ఎల్లాయపల్లెలోని చిన్మయారణ్యం నిర్వాహకులు శీతాలానంద మాతాజీ, కమిటీ వారి ఆధ్వర్యంలో వెళ్లిన భక్తులు అయోధ్యలో నిర్వహించనున్న శ్రీరామ తత్వం, అయోధ్యరాముడు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

చిన్నారుల ప్రతిభ



వివిధ పతకాలు సాధించిన చిన్నారులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరంలోని పీస్‌ ఇంగ్లీషు మీడియం హైస్కూలు చిన్నారులు ఫస్ట్‌ ఓపెన్‌ స్టేట్‌ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో రాణించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. కడప నగరంలోని మున్సిపల్‌ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో చాంపియన్‌షిప్‌ పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు రెండు గోల్డ్‌, ఒక సిల్వర్‌, ఒక బ్రౌంజ్‌ మెడల్‌ దక్కించుకున్నారు. ఆరవ తరగతి విద్యార్థి షేక్‌ ఇబ్రహీం, సయ్యద్‌ ఇబ్రహీం ఖలీలుల్లాలు బంగారు పతకాలు, 3వ తరగతికి చెందిన ఖాలీద్‌ వెండి, 6వ తరగతి విద్యార్థి సీఎస్‌ ఇషాక్‌ కాంస్య పతకం సాధించారు. పాఠశాల కరస్పాండెంట్‌ చిన్నారులను అభినందించి భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు.

మెడికల్‌ సీట్లు ప్రైవేటు పరం చేస్తే సామాన్యుల పరిస్థితి ఏంటి?



మెడిసిన్‌ చదివే విద్యార్థులకు మెడికల్‌ కాలేజీలు నిర్మించి ఆసరాగా ఉండాల్సిన ప్రభుత్వం ఆదిశగా పని చేయకుండా విస్మరిస్తోంది. వైఎస్‌ జగన్‌ పాలనలో రాష్ట్రంలో కొత్తగా మెడికల్‌ కాలేజీలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్‌ కాలేజీలను అభివృద్ధి చేయకుండా ప్రవేటు పరం చేస్తామంటూ ప్రకటించడం విడ్డూరంగా ఉంది. పేద విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించకుండా ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గ ఆలోచన చేయడం అన్యాయం. - బి. అంజనాదేవి, నబీకోట, కడప



సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపడమే?



మెడికల్‌ కళాశాలలను ప్రైవేట్‌ పరం చేయడం దారుణం. సామాన్య, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలను పెంపొందించాలి. వెంటనే ప్రైవేట్‌పరం అనే విధానానికి స్వస్తి పలకాలి. ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి న్యాయం చేయాలి. పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేయాలి. పేద విద్యార్థులు మెడిసిన్‌ చదవాలనే కలను నెరవేర్చాలి.

- ఉదయ్‌కుమార్‌, కడప

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

వైవీయూ: ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని 30 ఆంధ్రా బెటాలియన్‌ కమాండింగ్‌ ఆఫీసర్‌ కల్నల్‌ ఎన్‌. సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు 7వ కంబైన్డ్‌ ఆన్యువల్‌ ట్రైనింగ్‌ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండోరోజు సోమవారం ప్రారంభోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ కిషన్‌దత్‌ మాట్లాడుతూ ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. క్రమశిక్షణ, ఐకమత్యతతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని సూచించారు. శిక్షణలో భాగంగా మ్యాప్‌ రీడింగ్‌, ఫిజికల్‌ ట్రైనింగ్‌ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ ఉజ్వల భవితకు బాట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్‌, సీటీఓలు పవన్‌, సురేందర్‌ నాయక్‌, హైదర్‌, పరేడ్‌ శిక్షకులు సుబేదార్‌ మేజర్‌ అనిల్‌కుమార్‌, సీఎల్‌రెడ్డి, కొండారెడ్డి, సందీప్‌సింగ్‌, బసెనెట్‌, కార్యాలయ సూపరింటెండెంట్‌ డేవిడ్‌, సిబ్బంది ఉమ, ప్రియ, జయసుధ, ఎన్‌సీసీ కేడెట్స్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్యాంపు కమాండెంట్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ కిషన్‌దత్‌

సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా అధ్యక్షుడు ఏ గోపాలకృష్ణయ్య తెలిపారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యం పేరుతో భారం వేసే విధానాన్ని మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా విధానంలో ప్రధానమంత్రి ఫసల్‌ బీమా లో భాగంగా ప్రయివేటు ఇన్సూరెన్స్‌ కంపెనీలకు అవకాశం కల్పిస్తున్నారని, ప్రయివేటు ఇన్సూరెన్స్‌ కంపెనీలకు లాభాలు తప్ప రైతుల ప్రయోజనాలు ఏ మాత్రం పట్టించుకోరన్నారు. ప్రభుత్వ ఇన్సూరెన్స్‌ కంపెనీలను మాత్రమే పంటలబీమా లో భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి



చెన్నారెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్‌: కడప నగరపాలక సంస్థలో 13వ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి సోదరుడు, రిటైర్డ్‌ ఆర్‌టీసీ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎం. చెన్నారెడ్డి(72) మృతిచెందారు. సోమవారం ఉదయం కడప నగరంలోని బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఉదయం 6.30 గంటలకు కన్నుమూశారు. చెన్నారెడ్డి మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్‌ కె. సురేష్‌ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు సందర్శించి నివాళులు అర్పించారు.

సేవతోనే ఆత్మ సంతృప్తి



రిమ్స్‌లో పేదలకు అన్నదానం చేస్తున్న డాక్టర్‌ రమాదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : సేవా కార్యక్రమాల ద్వారా లభించే ఆత్మ సంతృప్తి మాటల్లో వర్ణించలేమని రిమ్స్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమాదేవి తెలిపారు. సోమవారం స్థానిక రిమ్స్‌ హాస్పిటల్‌లో రాష్ట్ర మంత్రి సత్య కుమార్‌ యాదవ్‌ జన్మదిన సందర్భంగా జేబీవీఎస్‌ ది ప్రిజర్వేర్‌ సేవా సమితి ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్‌ రమాదేవి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే ఈ కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులను ఆమె అభినందించారు. బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభా బాయ్‌ , రిమ్స్‌ ఆర్‌ఎంఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోతుల ట్రస్టు ఆధ్వర్యంలో..

కడప కల్చరల్‌: కడప నగరంలోని పీవీఆర్‌ పోతుల గ్రాండ్‌ ఇన్‌ లాడ్జి వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. కె.ఫాతిమాబీ సంస్మరణగా కుమారుడు కె.సిద్దు హుసేన్‌తోపాటు పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి, సరస్వతమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో పోతుల వెంకట్రామిరెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం 200 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ డాక్టర్‌ వల్లూరు బ్రహ్మయ్య, జీఎస్టీ అసిస్టెంట్‌ కమిషనర్‌ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెడికల్‌ కాలేజీలను రద్దు చేయడం దారుణం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కొత్త మెడికల్‌ కాలేజీలను రద్దు చేయాలని లేఖ రాయడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి నిర్వాకంతో ఈ ఏడాది 50 ఎంబీబీఎస్‌ సీట్లు పోయాయన్నారు. పులివెందుల మెడికల్‌ కాలేజీని నిర్వహించలేమని గుట్టు చప్పుడు కాకుండా లేఖ రాయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్‌ పరం చేసి, వైద్య విద్యను ప్రైవేట్‌ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే అందని ద్రాక్షలా మారిన వైద్య విద్యను పేద విద్యార్థులకు మరింత దూరం చేసే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. కూటమి సర్కార్‌ లో భాగస్వామ్య పక్షంగా ఉండి, ఈ ఏడాది 5 కొత్త కాలేజీలైన పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరుల్లో వసతులను కల్పించలేమని, నిర్వహించడం సాధ్యపడదని, అదనపు సీట్లు కూడా అవసరం లేదని మెడికల్‌ బోర్డు కి లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనివల్ల రాయలసీమ పరిధిలోని ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. కొత్తగా 750 సీట్లు సమకూరక పోవడం మీ నిర్లక్ష్యం ఫలితమేనన్నారు. రూ.లక్షలు పోసి లాంగ్‌ టర్మ్‌ కోచింగ్‌ తీసుకున్న పిల్లల భవిష్యత్‌ను అగమ్య గోచరంగా మార్చారన్నారు. కొత్త మెడికల్‌ కాలేజీల్లో వసతులను కల్పించి, మరింత నాబార్డ్‌ కింద నిధులు తీసుకొచ్చి వైద్య కళాశాలలను పూర్తి చేసి ఈ ఏడాది నుంచే వాటిని ప్రారంభించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి

18న అన్న క్యాంటీన్ల ప్రారంభం

– నగరపాలక కమిషనర్‌ వైఓ నందన్‌

కడప కార్పొరేషన్‌: కడప నగరంలో నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్లను ఈనెల 18వ తేది ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ వైఓ నందన్‌ ఆదేశించారు. సోమవారం ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి అన్న క్యాంటీన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ కార్యాలయం, మున్సిపల్‌ కార్యాలయం పక్కన, పాత బస్టాండ్‌ వద్ద ఉన్న క్యాంటీన్లలో వివిధ సౌకర్యాలు, నిర్వహణ వంటి వాటిని పరిశీలించారు. ప్రధానంగా నీటి సదుపాయాలు, ఫర్నిచర్‌, ఉపకరణాల నిర్వహణ పై అధికారులతో మాట్లాడారు. నీటి సదుపాయాలు తగిన ప్రమాణాలలో లభిస్తున్నాయా, ఫర్నిచర్‌ సక్రమంగా ఉన్నదా, క్యాంటీన్‌ వినియోగంలో ఉన్న పరికరాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయా అనే అంశాలపై కమిషనర్‌ పరిశీలన చేసి, తగిన సూచనలు అందించారు. క్యాంటీన్‌ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంటీన్‌ ఎంట్రెన్స్‌ నందు ఎలాంటి వాహనాలు అడ్డుగా లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ చెన్నకేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ ధనలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్లు వేణుగోపాల్‌, కిరణ్‌, ఏఈలు పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్‌ వైఓ నందన్‌

మాదక ద్రవ్యాలను పూర్తిగా నిరోధించాలి

కడప కార్పొరేషన్‌: వైఎస్సార్‌ జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిగా నిరోధించాలని రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సంపత్‌ కుమార్‌ అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాల వల్ల యువత తప్పుదోవ పడుతోందన్నారు. మాదకద్రవ్యాల వల్ల ఎలాంటి అనర్థాలు ఎదురవుతాయో, ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయో ఈ కరపత్రాల్లో ముద్రించడం జరిగిందన్నారు. వీటిని కడప నగరంలో ముఖ్య ప్రాంతాలైన మాసాపేట, మాచుపల్లి బస్టాండ్‌ నుండి దేవుని కడప, రాజీవ్‌ పార్క్‌, కంది పాలెం, ఎర్రముక్కపల్లి, తదితర చోట్ల పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసన్‌, రక్షణ యూత్‌ ధీరజ్‌, కారుణ్య, రత్న కుమార్‌, విజయ్‌ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రక్షణ సంస్థ ప్రతినిధులు

మహమ్మద్‌ ప్రవక్త జీవితం ప్రపంచానికే ఆదర్శనీయం

కడప కల్చరల్‌ : మహా ప్రవక్త మహమ్మద్‌ (సా.అ.వ) జీవితం ప్రపంచ మానవాళికే ఆదర్శనీయమని పలువురు మత గురువులు కొనియాడారు. సోమవారం రాత్రి కడప నగరంలోని రహమతుల్లా వీధిలో ఉన్న మీలాద్‌ ఘర్‌లో మిలాద్‌ ఉన్‌ నబీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మీలాద్‌ కమిటీ ఆధ్వర్యంలో జష్నే మీలాదున్‌ నబీ (సల్లెల్లాహు అలైహి వసల్లం) ఆధ్యాత్మిక సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సయ్యద్‌ షా మీర్‌ ఖాద్రి షామీరి సాహెబ్‌, మౌలానా మౌల్వి ముఫ్తీ సయ్యద్‌ సయిద్‌ అహ్మద్‌ బాక్వి సాహెబ్‌, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్‌ సయ్యద్‌ అహ్మద్‌ బాబు భాయ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా ప్రవక్త జీవితంలోని పలు ఘట్టాలు, ఆయన జీవన విధానం గురించి తెలియజేశారు.చివరగా నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మీలాద్‌ కమిటీ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి హాజీ మహమ్మద్‌ అహ్మదుల్లా, వైస్‌ ప్రెసిడెంట్‌ సిరాజుద్దీన్‌ బుఖారి, జాయింట్‌ సెక్రెటరీ షేక్‌ నయీమ్‌, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక సభలో పాల్గొన్న మత గురువులు



మాట్లాడుతున్న పీఠాధిపతి హుస్సేన్‌ బాషా షహమీరి

అన్నదానం..

మిలాదున్నబీ సందర్భంగా కడప నగరంలో రవీంద్రనగర్‌లోని రాజ్‌ ఫంక్షన్‌ హాల్లో సోమవారం అన్నదానం చేశారు. పీఠాధిపతి హుస్సేన్‌ బాషా షహమీరి ఫజర్‌ నమాజ్‌ తర్వాత ఫాతెహా చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్‌ అబ్దుల్లా, ఫర్హతుల్లా, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో అన్నదానం

కడప కల్చరల్‌ : మహా ప్రవక్త మహమ్మద్‌ (సా.అ.వ) పవిత్ర జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కడప నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అమీన్‌పీర్‌ (పెద్ద)దర్గాలో బార్మి అన్నదానం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్‌ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌ మార్గదర్శకత్వంలో దర్గా భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుంచి దర్గా ప్రాంగణంలో అన్నప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. దర్గా వలంటీర్లు సహకారం అందించారు.

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : మహా ప్రవక్త మహమ్మద్‌ (సా.అ.వ) జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కడప నగరం రెండవ గాంధీబొమ్మ వద్ద మౌలాన ఎడ్యుకేషనల్‌ అండ్‌ వెల్ఫేర్‌ సొసైటీ అధ్యక్షుడు షేక్‌ అబ్దుల్‌ షబ్బీర్‌ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.



పెద్ద దర్గా ఆధ్వర్యంలో బార్మీ అన్నదానం

ఘనంగా మిలాద్‌ ఉన్‌ నబీ శాంతి ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్‌ : మహమ్మద్‌ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం అంజుమన్‌ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో మిలాద్‌–ఉన్‌–నబీ శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ముస్లింలు జెండాలు చేతపట్టుకుని అల్లా నామస్మరణ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా అడుగుజాడల్లో నడవాలని, అల్లా గొప్పతనాన్ని, ఆయన మానవాళికి చేసిన మేలును, మహమ్మద్‌ ప్రవక్త ప్రవచనాలను, సందేశాలను శిరసావహించాలని మత పెద్దలు వివరించారు. మైదుకూరు రోడ్డులోని నజీరుల్లాషా మఠం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పుట్టపర్తి సర్కిల్‌, గంగమ్మ దేవాలయం వీధి, గాంధీరోడ్డు మీదుగా సుందరాచార్యుల వీధిలోని అసారేషరీఫ్‌కు చేరింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ ఇన్‌చార్జి చైర్మన్‌ వీఎస్‌ ముక్తియార్‌, అంజుమన్‌ అహలే ఇస్లాం కమిటీ ప్రెసిడెంట్‌ మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఇలియాస్‌, టౌన్‌బ్యాంక్‌ ఉపాధ్యక్షుడు ఖలీల్‌, కౌన్సిలర్‌లు గౌస్‌, కమాల్‌బాషా, వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు ఫరీద్‌, ముస్లిం మత ప్రముఖులు, పట్టణంలోని 40 మసీదుల కమిటీ పెద్దలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్‌ : శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నేడు మండల సమావేశం

వల్లూరు : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మలేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కావున మండల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

రేపు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీ హోమాలను నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్ట్‌

లింగాల : మండల పరిధి పార్నపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్న జూదరులపై సోమవారం సాయంత్రం లింగాల ఎస్సై మధుసూదన్‌ రావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామని ఆయన అన్నారు. వారి వద్ద ఉన్న మూడు లక్షల 15500 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఘనంగా నిమజ్జనం



నందిమండలంలో వినాయకుడి లడ్డూతో చంద్రశేఖర్‌

పెండ్లిమర్రి : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని నందిమండలం గ్రామంలో సోమవారం ఘనంగా గణనాథుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలు చేసి వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లలో గ్రామంలో ఊరేగింపు చేశారు. డప్పులు, మంగళవాయిద్యాల మధ్య బాణసంచా కాల్చుతు చిన్నారులు, యువత నృత్యాలు చేశారు. రంగులు చల్లుకుంటూ, ఆట పాటలతో సమీపంలో ఉన్న కాల్వలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

ఈ గ్రామంలోని చౌడమ్మ వీధిలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. పంగా చంద్రశేఖర్‌ రూ.1.01,000 లక్షలకు పాట పాడి వినాయకుడి లడ్డూను దక్కించుకున్నాడు.

నివాళి

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు అబ్దుల్‌ ఖాదర్‌(90) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అక్కడికి వెళ్లారు. మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు చావలి శివ, అమర్‌నాథ్‌ రెడ్డి, రవి, సురేష్‌ ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలిక

కమలాపురం: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని 5వ వార్డు అంధుల కాలనీకి చెందిన జయన్న కుమార్తె వీధి కుక్కల దాడిలో గాయపడింది. సోమవారం రాత్రి వీధిలోని కుక్కలు కొట్లాడుకుంటూ ఒక్కసారిగా వచ్చి బాలిక పై పడి తీవ్రంగా గాయ పరిచాయి. పట్టణంలో వీధి కుక్కలు, పందులు విచ్చల విడిగా తిరుగుతున్నాయి. వాటిని తొలగించాలని పట్టణ ప్రజలు పలు మార్లు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని శ్యాం, మౌలాలి, విజయ్‌, సురేష్‌ తదితరులు కోరుతున్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

వేంపల్లె : రాష్ట్రంలో చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మగ్గం నేసే కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున డిమాండ్‌ చేశారు. సోమవారం వేంపల్లెలో చేతివృత్తుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్రంలో అన్ని కలెక్టరేట్‌ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని నలుమూలల ఉన్న చేతివృత్తుల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో చేతివృత్తుల జాతీయ నాయకులు గూడూరు రామచంద్ర, డాక్టర్‌ సుబ్రహ్మణ్యం, కమలాపురం అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.